నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

డిఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఇవివిఎన్ఎస్ఎస్బిఎల్.నారాయణను ఎస్ఎఫ్ఐ కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ బృందం స్థానిక కలెక్టరేట్లో డిఇఒకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.గణేష్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారన్నారు. అటువంటి ప్రయివేటు పాఠశాలలు గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణ్, బి.సింధు, పట్టణ కమిటీ సభ్యులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జనానికి దూరంగా.. సమావేశాల్లో బిజీగా..

జిల్లా అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాల్లోనే

క్షేత్రస్థాయిలో జనం వద్దకు వెళ్లలేని పరిస్థితుల్లో అధికారులు

కార్యాలయాలకు వెళ్లినా కాన్ఫరెన్స్‌లో ఉండటంతో తప్పని పడిగాపులు

ఒకేసారి జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారుల కాన్ఫరెన్స్‌లు

దిక్కుతోచని స్థితిలో సోమవారం పిజిఆర్ఎస్‌కు జనం

జనం సమస్యలను వదిలి.. సమావేశాలతో సరిపెట్టడంపై విమర్శలు

'రామారావు తన సమస్యను కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని సంబంధిత శాఖ జిల్లా కార్యాలయానికి వచ్చాడు. సార్.. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్(విసి)కు వెళ్లారని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో వెళ్లిపోయి మరోసారి వచ్చారు. సార్.. లోపలే ఉన్నారుగాని.. వీడియో కాన్ఫరెన్స్ జరుగుతోందని సమాధానం రావడంతో బయటే పడిగాపులు పడాల్సిన పరిస్థితి. సదరు అధికారికి తమ సమస్య చెప్పకునేందుకు పనులు మానుకుని రోజులు తరబడి తిరుగుతూ ఆ వ్యక్తి పడిన కష్టం అంతాఇంతా కాదు'.

'కిషోర్ అనే వ్యక్తి తన సమస్యకు సంబంధించిన ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారిని కలిసేందుకు వచ్చారు. కలెక్టరేట్‌లో మీటింగ్‌లో ఉన్నారని, ఒకసారి, కోర్టు పని మీద వెళ్లారని మరోసారి.. సమాధానం తప్ప ఆయన దర్శనం మాత్రం కాలేదు. తమ ప్రాంతంలోకి వచ్చినప్పడు చెప్పకుందామంటే క్షేత్రస్థాయికి అధికారులు రావడం అరుదుగా మారిపోయింది. దీంతో గత్యంతరం లేక సోమవారం పిజిఆర్ఎస్‌లో వినతి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది'.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ఫీల్డ్‌కు వెళ్లి జనాల సమస్యలను తెలుసుకునే పరిస్థితి లేకుండాపోయింది. ప్రతిరోజూ వీడియో కాన్ఫరెన్స్‌లు, జిల్లా ఉన్నతాధికారుల సమావేశాలతోనే బిజీగా గడుపుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు అవగాహన లేకుండా పోతుంది. కిందిస్థాయి అధికారులు ఏం చెబితే అదే వాస్తవమని భావించి నిర్ణయాలు తీసుకుంటున్న పరిస్థితి ఉంటోంది. మండల స్థాయిలో అధికారులు సైతం వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలతో బిజిబిజీగా ఉంటూ ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిపాలనలో మార్పు కన్పిస్తుందని అంతా ఆశించారు. అందుకు భిన్నంగా పాలన సాగడంపై విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా అధికారులు సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. దీంతో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కిందిస్థాయి అధికారులకు సమస్యలు చెప్పకున్నా పరిష్కారం కాకపోవడంతో జిల్లా అధికారులను కలిసి తమ సమస్యను చెప్పకోవాలని జనం చూస్తున్నా అవకాశం దక్కడం లేదు. వారంలో ఏడు రోజులు వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలతో బిజీగా ఉంటే ప్రజలను అధికారులు కలిసేదెప్పుడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏదైనా శాఖకు సంబంధించి జిల్లా అధికారిని కలవాలంటే ఒక రోజంతా నిరీక్షించినా సాధ్యం కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరుకాకపోతే జిల్లా అధికారులపై ఉన్నతాధికారులు చిందులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. దీంతో గంటలు తరబడి వీడియో కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొనడంతోనే జిల్లా అధికారులకు సరిపోతుంది. వ్యవసాయం, పంచాయతీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, మత్స్యశాఖ, హౌసింగ్, మార్కెటింగ్ ఇలా ఏశాఖకు సంబంధించిన అధికారులైనా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తే ప్రజల సమస్యలు క్షుణ్ణంగా అర్థమవుతాయి. ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉందనేది తెలుస్తోంది. కిందిస్థాయి అధికారులు కార్యాలయాలకు వస్తున్నారో, లేదో అర్థమవుతుంది. అలాకాకుండా జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, జిల్లా అధికారులు కిందిస్థాయి సిబ్బందికి అదే వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేయడంతోనే రోజులు గడిచిపోతున్నాయి. సోమవారం పిజిఆర్ఎస్ ఉండటంతో జిల్లా కేంద్రంలోనే అధికారులంతా ఉండాలి. ఆ తర్వాత ఐదు రోజులు కూడా సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల పేరుతో జిల్లా అధికారులను హెడ్‌క్వార్టర్‌లోనే బందీలుగా ఉంచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనం జిల్లా అధికారులను నిలదీస్తే మీటింగ్‌లో ఉన్నామని సమాధానం చెబుతున్నారు. కొన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఇదే అవకాశంగా పని మొత్తం పక్కన పెట్టేస్తున్నారు. ఒకవేళ సమావేశం లేకపోయినా ఉన్నట్లు కార్యాలయాల్లోని అధికారులతో చెప్పించి సొంత పనులు చూసుకుంటున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. ఒకే సమయంలో జిల్లా కలెక్టర్, రాష్ట్రస్థాయి అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లు సైతం నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో జిల్లా అధికారులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారులు ఇస్తున్న నివేదికలకు.. వాస్తవ పరిస్థితికి సంబంధం ఉండటం లేదు. దీంతో ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు అమలు చేసినా జనాలకు చేరని పరిస్థితి ఉందనే చర్చ సైతం సాగుతోంది.

జనానికి సోమవారం పిజిఆర్ఎస్‌నే దిక్కు..

జిల్లా అధికారులను కలిసే అవకాశం జనానికి లేకుండాపోవడంతో ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)నే దిక్కుగా మారింది. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో దాదాపు నెలన్నరపాటు పిజిఆర్ఎస్ నిలిచిపోయింది. దీంతో జనం తమ సమస్యలను ఎవరికి చెప్పకోవాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. జిల్లా అధికారులు మామూలు రోజుల్లో దొరకకపోవడం, పిజిఆర్ఎస్‌లో జిల్లా అధికారులంతా ఉంటారని భావించి జనం దానికి క్యూ కడుతున్నారు. మండలస్థాయిలో పిజిఆర్ఎస్ అమలు చేస్తున్నా జనాలు అక్కడ ఫిర్యాదులు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. ఎందుకుంటే మండలస్థాయిలో తీసుకుంటున్న ఫిర్యాదులను అధికారులు సరిగా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం జనాల్లో నెలకొంది. వారంలో సగం రోజులైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

భీమవరంలో బాంబు కలకలం

విష్ణు డెంటల్ కాలేజీకి మెయిల్ - జల్లెడ పట్టిన పోలీసులు

ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న జనం

విష్ణు డెంటల్ కాలేజీలో తనిఖీలు చేస్తున్న బాంబ్స్ స్క్వాడ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కేంద్రం భీమవరం ప్రజలు బాంబు భయంతో ఉలిక్కిపడ్డారు. దేశవ్యాప్తంగా పేరొందిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్ విద్యాసంస్థల ప్రాంగణంలోని విష్ణు డెంటల్ కళాశాలలో బాంబు పెట్టినట్లు బుధవారం మధ్యాహ్నం ప్రిన్సిపల్ డాక్టర్ రామరాజుకు మెయిల్ వచ్చింది. దీంతో యాజమాన్యం అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించింది. విద్యార్థులను, అధ్యాపకులను, సిబ్బందిని హుటాహుటీన బయటకు పంపించేశారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి విష్ణు డెంటల్ కళాశాలలో జల్లెడ పడుతున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు నిర్వహించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి మరోసారి తనిఖీలు చేసినా ఎటువంటి అనుమానిత వస్తువులుగాని, పరికరాలుగానీ లభించకపోవడంతో బాంబు బెదిరింపు ఉత్తిదేనని తేలింది. దీంతో అటు యాజమాన్యం, ఇటు పోలీసులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో పోలీస్ సైబర్ క్రైమ్ టీమ్ రంగంలోకి దిగి మెయిల్ ఎక్కడ నుంచి వచ్చింది, ఎవరు చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. భీమవరం రూరల్ ఎస్ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళనకు గురైన విద్యార్థుల తల్లిదండ్రులు

కళాశాలకు బాంబు బెదిరింపు రావడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రధానంగా కళాశాల హాస్టల్లో ఉండి చదువుకుంటున్న దూరప్రాంత విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. యాజమాన్యానికి, సమీప ప్రాంతాల్లో ఉన్న బంధువులకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫోన్లు పెద్దసంఖ్యలో వచ్చాయి.

పూలసాగుపై రైతులు దృష్టి సారించాలి

ఉద్యాన ఉత్పత్తుల అవగాహనా సదస్సులో కలెక్టర్ నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని రైతులు అధిక ఆదాయం పొందేందుకు పూలసాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక హోటల్ ఆనంద ఇన్‌లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలసాగు, ఉద్యాన విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహనా సదస్సు, రైతులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి కలెక్టర్ పూల ప్రదర్శనను తిలకించి మాట్లాడారు. జిల్లాలోని పెనుగొండ, సిద్ధాంతం ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, జిల్లాలో పూలసాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. పూలసాగుకు ప్రాథమిక పెట్టుబడి కొంత ఎక్కువగా ఉన్నా పూలు కోతకు వస్తే అధిక ఆదాయాన్ని పొందుతారన్నారు. పూలసాగుకు పెట్టుబడిగా టర్మ్ లోన్స్ ఐదేళ్ల అనంతరం చెల్లించేలా ఇస్తారని, నాబార్డు, డిఆర్‌డిఎ రుణాలతోపాటు ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా మల్లె తోట సాగుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలంకరణ పూలకు దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉందని, పెరవలి మండలం కాపవరంలో ఐదు ఎకరాల్లో ఆర్కిడ్ ఫ్లవర్స్ సాగు విజయవంతంగా చేస్తున్నారని, తాను కూడా స్వయంగా పరిశీలించానని తెలిపారు. పూల సాగుకు తక్కువలో తక్కువ 10 సెంట్లు నుండి ఒక ఎకరం వరకు సాగు చేసుకోవచ్చని, దశలవారీ సాగును పెంచుకోవచ్చని తెలిపారు. ప్రపంచంలో పూల సాగులో భారతదేశం రెండో స్థానంలోను, చైనా మొదటి స్థానంలోను ఉన్నాయని అన్నారు. మన దేశంలో 2.85 లక్షల హెక్టార్లలో పూల సాగు జరుగుతుందన్నారు. ప్రపంచంలో 35 శాతం పూలసాగు భారతదేశంలోనే ఉందని తెలిపారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ 19 వేల హెక్టార్లలో పూల సాగు చేస్తూ మూడోస్థానంలో ఉందన్నారు. జిల్లాలో రెండు లక్షల హెక్టార్ల సాగు భూమిలో 1.20 లక్షల హెక్టార్లలో వరి సాగు, 50 వేల హెక్టార్లలో ఆక్వా చెరువులు ఉన్నాయని తెలిపారు. ఇతర వ్యవసాయ పంటలు పోను 15 వేల హెక్టార్లలో మాత్రమే ఉద్యాన పంటల సాగు ఉందన్నారు. పాలిహౌస్ సాగులో బహిరంగ సాగు కంటే మూడు రెట్లు దిగుబడులు ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. పాలి హౌస్ ద్వారా క్యాప్సికమ్, బ్రిటిష్ కుకుంబర్, జెర్బరా, ఆర్కిడ్ వంటి అధిక విలువ గల కూరగాయలు పూల సాగును చేపట్టి లాభాలను పొందవచ్చన్నారు. పాలి హౌస్ నిర్మాణానికి అయ్యే ఖర్చులో 50 శాతం రాయితీగా గరిష్టంగా ఎకరానికి రూ.16 లక్షల రాయితీ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పాలి హౌస్‌లో పూలు, కూరగాయల పంటల సాగుకు ఎకరానికి గరిష్టంగా రూ.5 లక్షల రాయితీ సదుపాయం ఉందని తెలిపారు. తొలుత పూలసాగుపై కెవికె హెడ్ డాక్టర్ మల్లికార్జున్, డైరెక్టర్ ఆఫ్ ఫ్లోరికల్చర్ డాక్టర్ డివిఎస్.రాజు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.లలితకామేశ్వరి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు జిల్లాలో పూల సాగుకు ఉన్న అవకాశాలు, దేశ విదేశాల్లో మార్కెటింగ్ వంటి వాటిపై వివరించారు. ఈ సదస్సులో జిల్లా ఉద్యాన శాఖాధికారి ఆర్.దేవానందకుమార్, నాబార్డు డిడిఎం టి.అనిల్‌కాంత్, హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి, సైంటిస్ట్ డాక్టర్ వి.శివకుమార్, వేమగిరి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రాంపాల్, రైతులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

కొనసాగిన ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర

తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - పెంటపాడు

కూటమి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. ప్రజా చైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర బుధవారం పెంటపాడు మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పెంటపాడులో జరిగిన సభకు సిపిఎం నాయకులు చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షత వహించారు. గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని, వారి సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ అడుగు జాడల్లోనే కూటమి ప్రభుత్వం నడుస్తోందని, దానికి స్మార్ట్ మీటర్లు బిగింపేనని అన్నారు. తక్షణం స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపి విద్యుత్ భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురి నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావు, బర్ల బాలాజీ, పెనగంటి దుర్గా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పేద కుటుంబాలు నివాసముంటున్న కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర అలంపురం, ఆరుగొలను, ఇటుకలగుంట మీదుగా మంగళవారం రాత్రి తాడేపల్లిగూడెం ఎల్.అగ్రహారం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్దకు చేరుకుంది. తాడేపల్లిగూడెం టిడ్కో ఇళ్ళు, జగనన్న కాలనీ, కెఎస్ఎన్ కాలనీ, యాగర్లపల్లి కాలనీ మీదుగా సైకిల్ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో యాత్ర బృందం పర్యటించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ నాయకులు జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, యడవల్లి వెంకట దుర్గారావు, బంకురు యశోద పాల్గొన్నారు.

గణపవరం: ప్రభుత్వ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర బుధవారం మండలంలోని పిప్పర, కేశవరం, తాళ్లపాలెం, మొయ్యేరు, కోమట్లపాలెం గ్రామాల్లోని మీదుగా సాగింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ కాలనీల్లో నివాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొయ్యేరు కాలనీలో ప్రజలు యాత్ర నేతలతో

పెనుమంట్రలో..

మాట్లాడుతూ ఇళ్ల స్థలాలిచ్చిన ప్రభుత్వం ఇంటి నిర్మాణం చేసుకోవడం కోసం ఇచ్చిన సొమ్ము చాలక అప్పులు చేశామని, వాటి వడ్డీలు చెల్లించలేకపోతున్నామని తెలిపారు. కాలనీల్లో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయకపోవడంతో నానావస్థలు పడుతున్నామని వాపోయారు. దీనిపై గోపాలన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న కలక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రుణం అందించాలని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి ఇచ్చిన రుణాలు రద్దు చేయాలని కోరారు.

అత్తిలి: సైకిల్ యాత్ర బుధవారం ఉరదాళ్లపాలెం వద్ద మండలంలోకి ప్రవేశించింది. అనంతరం యాత్ర అత్తిలి చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయలు బాబూరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో లబ్ధిదారులతో సెంటున్నర స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలని ప్రజాప్రతినిధుల ఒత్తిడి ఫలితంగా అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఆయా ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక

గణపవరంలో..

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఓపక్క అప్పులు తీర్చలేక, మరోపక్క సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నేతలు కేతా గోపాలన్, కె.క్రాంతిబాబు, గొర్ల రామకృష్ణ, బి.విజయ్, కె.ధర్మేంద్ర, రాంబాబు, సిహెచ్.నాగరాజు పాల్గొన్నారు. అత్తిలిలో వైఎస్ఆర్ కాలనీకి రేషన్ వ్యాన్, తాగునీరు, వీధి దీపాల సమస్య ఉన్నట్లు బృందం దృష్టికి జనం తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పంచాయతీ అధికారికి ఫోన్ చేసి ఆయా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పెనుమంట్ర: కాలనీల్లోని ప్రజలకు కూటమి ప్రభుత్వం వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ కోరారు. బుధవారం సాయంత్రం మండలంలోని బ్రాహ్మణచెర్వు సెంటర్‌కు సైకిల్ యాత్ర చేరింది. ఈ సందర్భంగా గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని, బ్రాహ్మణచెరువు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి తాగునీరు, వీధి దీపాలు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హరేరామ్, కూసంపూడి సుబ్బరాజు, తెన్నేటి ఆంజనేయులు, గంటి ఆంజనేయులు, కొప్పిశెట్టి పరమేశు, బొంతు శ్రీను, మాదాసు లక్ష్మణరావు, ఉండ్రాజవరం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాత్రం పొలమూరు మీదుగా వీరవాసరం మండలం కొణితివాడ చేరుకుంది.

పెంటపాడులో..

పని ఒత్తిడి తగ్గించండి

ఆందోళనబాటలో కార్యదర్శులు - ఎంపిడిఒలకు వినతులు

గణపవరం ఎంపిడిఒ బేబీలక్ష్మీకి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ బుధవారం మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మికి కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డిఎస్ఆర్.ప్రసాద్, అధ్యక్షులు ఎన్.నాగేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం 13 రకాల సర్వేలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేతోపాటు ఇంటి పన్ను, కుళాయి పన్నులు వసూలు చేయడంలో కార్యదర్శులు ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇంకా 26 రకాల పనులు చేయాలని ఒత్తిడి చేయడం వల్ల విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు మానసికంగా, శారీరకంగా అలసిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: అధిక పనిభారం, ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు ఉపశమనం కల్పించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు దొంగ సత్యనారాయణ కోరారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ జి.స్వాతి, ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శులు మాట్లాడుతూ సెలవు దినాల్లో కూడా పనులు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ అధ్యక్షులు దొండపాటి సునీల్‌రాజు, జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల సతీష్ కుమార్, యూనియన్ జిల్లా ట్రెజరర్ సుంకర వెంకటేష్, మండల గౌరవాధ్యక్షులు తోట బాలకృష్ణ మోహన్, ఎ.పోలయ్య, ఎస్.అరుణాదేవి, బి.శ్రీనివాస్, మండల కార్యదర్శి సుజాత, జివి.రామకృష్ణంరాజు, మణికంఠ, పలువురు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలకోడేరు :ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాలకోడేరు: తమపై పని భారాన్ని తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ వి.రెడ్డియ్య, ఇఒపిఆర్‌డి రామప్రసాద్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల సర్వేలతో తాము సతమతమవుతున్నామని తెలిపారు. ఒకపక్క పంచాయతీల నిర్వహణ చూసుకుంటూనే, మరోపక్క పారిశుధ్య నిర్వహణ కూడా చేయడం జరుగుతుందని అన్నారు. ఇదిలా ఉండగానే సర్వేల పేరుతో నలిగిపోతున్నామని చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వేంద్ర, గొరగనమూడి, పాలకోడేరు, కుముదవల్లి, విస్సాకోడేరు, గరగపర్రు పంచాయతీ కార్యదర్శులు కృష్ణమోహన్, సరళ,బి.గోపి, బాలకృష్ణ, పవన్, ప్రశాంతి పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు జెవిటి.నాయుడు, కేశిరెడ్డి గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం ఉండి మండల విస్తరణాధికారి చల్లా వెంకట సుదర్శన రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, శివాజీ, సతీష్, స్రవంతి, విజయలక్ష్మి, అప్పారావు, లక్ష్మి, కృష్ణ చైతన్య, శ్రీలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

సభా ప్రాంగణం, హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలించిన ఎంఎల్ఎ రాధాకృష్ణ, కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి నయీం అస్మీ

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ, కలెక్టర్

ప్రజాశక్తి - తణుకు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 15వ తేదీన తణుకు రానున్నారు. మూడో శనివారం నిర్వహించే కార్యక్రమాన్ని సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధం అనే స్లోగన్‌తో నిర్వహించనున్న నేపథ్యంలో తణుకులో జరిగే బహిరంగ సమావేశంతోపాటు పార్టీ ప్రతినిధులు, అధికార యంత్రాంగంతో ఏర్పాటు చేసే సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో తణుకులో జరుగుతున్న సిఎం పర్యటన ఏర్పాట్లను ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీతో కలిసి పరిశీలించారు. ముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నికల్ కాలేజీ ఆవరణలో హెలీపాడ్, ఆడిటోరియంతోపాటు బహిరంగ సమావేశం జరిగే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ప్రజా వేదిక, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలలో పార్కింగ్ ప్రదేశం, స్టాల్స్ ప్రదర్శనకు ప్రాథమికంగా స్థలాలను పరిశీలించారు. అనంతరం మార్కెట్‌తోపాటు పెరవలి వైజంక్షన్ వద్ద కూరగాయల మార్కెట్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, తాడేపల్లిగూడెం, నరసాపురం ఆర్‌డిఒలు కతీబ్ కౌసర్ భానో, దాసిరాజు, తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

అదనపు ఆర్థిక లబ్ధిని వినియోగించుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు గృహ నిర్మాణాల్లో ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. బుధవారం వేల్పూరు లేఅవుట్‌ను కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గృహ నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయని విషయాన్ని ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీలో లబ్ధిదారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక లబ్ధిని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఎవై గ్రామీణ్, అర్బన్‌లో ఇల్లు మంజూరై ఇంకా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఎస్‌సిలు, బిసిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు 75,000 రూపాయలు గృహ నిర్మాణాలకు అదనంగా ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. పిఎంఎవై ఎన్‌టిఆర్‌లో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాల్సిన్నారు. జిల్లాలో సుమారు 18,340 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి గృహాలు వివిధ దశలలో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ కమ్యూనిటీ సెక్రటరీలు అర్హత కలిగిన ప్రతి ఇంటినీ తనిఖీ చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడంలో నిధుల మంజూరు కోసం మధ్యవర్తులు, ఇతరుల మోసపూరిత మాటలు నమ్మరాదని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఇఇ ఎం.శ్రీనివాస్. డిఇ ప్రసాద్, తహశీల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ, సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి ఉన్నారు.

కుళాయి ఏర్పాటు చేయాలంటూ వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పింజెర్వు ఆక్రమణదారులకు తాగునీటి సదుపాయం కల్పించాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మికి సిపిఎం నాయకులు బాలం విజయ్‌కుమార్, యండమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు.

కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

సుమారు యాభై కుటుంబాల వారికి తాగునీటి కుళాయిలు లేవన్నారు. రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే తమకు తాగునీరు కొనుగోలు చేసుకునే స్థోమత లేదని, వేసవి వస్తున్న నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని కార్యదర్శి వద్ద స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్యదర్శి వారి సమస్య పట్ల సానుకూలంగా స్పందించారు. జల జీవన్ మిషన్ పథకంలో పబ్లిక్ కుళాయి ఏర్పాటుకు మార్గదర్శకాలు ఇవ్వాలంటూ డిపిఒను కోరారు. పై అధికారుల నుండి అనుమతులు వచ్చిన తరువాత పబ్లిక్ కుళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణంలో ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యమని సంస్కార్ స్కూల్ డైరెక్టర్ నందమూరి రాజేష్, నాగమణి దంపతులు అన్నారు. బుధవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని బ్యాంకు కాలనీలోని సంస్కార్ స్కూల్ వద్ద నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతిఒక్కరూ స్టీల్ గ్లాస్‌లు, ప్లేట్లు మాత్రమే వాడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. అనంతరం బ్యాంక్ కాలనీలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.సరస్వతి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో కాపవరం సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు వద్ద ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని లేకుంటే ఊపిరితిత్తుల సమస్యలు, క్షయ, కేన్సర్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ జి.ఉదయ్ చందర్, ఎస్‌టిఎల్ఎస్ బి.లక్ష్మీనారాయణ, ఎఎన్ఎం సుజ్ఞానమని పాల్గొన్నారు.

నరసాపురం : సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నో స్మోకింగ్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్, ఎస్‌హెచ్ విభాగాధిపతి వి.స్వామినాథం మాట్లాడుతూ ధూమపానం ఆరోగ్యానికి హానికరం అన్నారు. సమాజానికి ప్రమాదకరమని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విస్సా మాణిక్యాలరావు మాట్లాడుతూ ధూమపానం వల్ల కలిగే ముప్పు గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కోశాధికారి కెవి.స్వామి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల కాలంలో జరిగిన ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కూటమి నాయకులు, టిడిపి శ్రేణులు ప్రజలకు వివరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అన్నా క్యాంటీన్ల ప్రారంభం, రహదారులు బాగు చేసి ప్రజా రవాణా మెరుగు పర్చడం, ఉచిత ఇసుక పాలసీ, నిరుద్యోగులకు డిఎస్‌సి ప్రకటన తదితర వాటి గురించి వివరించాలన్నారు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సిపిఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం పట్టణంలోని లంకపేట, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో ఇళ్లులేని నిరుపేదల చేత ఇళ్ల స్థలాలకై వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాల్లో 2, గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, ఎపి మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

పిఎంపి అసోసియేషన్ గణపవరం, నిడమర్రు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సరిపల్లి సాయిబాబా మందిరంలో గుండె వ్యాధులపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. తాడేపల్లిగూడెం ఆకాశం హాస్పటల్ డాక్టర్ టిపిఎన్.ప్రసాద్, డాక్టర్ గౌరీశంకర్ రెడ్డి మాట్లాడుతూ గుండె వ్యాధులైన స్ట్రోక్ ఎంజినా గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర గౌరవ సలహాదారులు ఎన్.జయసూర్య మాట్లాడుతూ గుండె వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వర్లు మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆకాశం హాస్పటల్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎస్.హిమశంకర్, ఏలూరు జిల్లా అసోసియేషన్ సహాయ కార్యదర్శి నిమ్మల సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - తణుకు రూరల్

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరగవరం గ్రామానికి చెందిన పత్తివాడ కరుణాకర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలోని యానంకు చెందిన 6 టిన్ బీర్లు, 1 మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం నిల్వలకు సంబంధించి, అమ్మకాలకు సంబంధించి సమాచారం ఉంటే 9440902436 నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంటాయన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

15 నుంచి పాలకొల్లులో జాతీయ స్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

సమాజాన్ని చైతన్యవంతం చేసేది, మానవ రుగ్మతలను రూపు మాపేది నాటకం. కళలకు, సాంఘిక నాటక రంగానికి పుట్టినిల్లు పాలకొల్లు. ఆధునిక నాటక రంగం అభివృద్ధికి పునాదులు వేసిన ఎందరో మహోన్నత వ్యక్తులు పాలకొల్లుకు చెందిన వారు కావడం గర్వించదగ్గ విషయం. కులంలేని పిల్ల, పంజరంలో పక్షులు, ఆదర్శ, పల్లె పడుచు వంటి ప్రజాదరణ పొందిన నాటికలు రచించిన పినిసెట్టి శ్రీరామ్మూర్తి పాలకొల్లుకు చెందిన వారు కావడం గర్వకారణం. దాసరి నారాయణరావు రచించిన 'నేను నా స్కూలు' నాటిక అనేక ప్రదర్శనలు జరిగాయి. కోడి రామకృష్ణ రథ చక్రాలు నాటిక రచించి, ప్రదర్శనలు చేసి అనేక బహుమతులు సాధించారు. పాలకొల్లులో కళా పరిషత్‌లకు 60 సంవత్సరాల క్రితమే శ్రీకారం చుట్టారు. అయితే ఈనెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పాలకొల్లు బస్టాండ్ సెంటర్లో అడబాల థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి నాటిక పోటీలు నిర్వహించడానికి పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ, గౌరవ అధ్యక్షులు మేడి కొండ శ్రీనివాసరావు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. కెవిఎస్ పివిఎన్.వర్మ, విఠాకుల రమణ, మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, షేక్ పీర్ సాహెబ్, కొల్లి కొండ ప్రసాద్, సోమంచి శ్రీనివాస శాస్త్రి, రెడ్డి వాసు, దాసరి నాని, నడపన శ్రీనివాసరావు, అంగర వీరభద్ర కుమార్, జిఎస్ఎన్.రవి సహకారాలు అందజేస్తున్నారు. నాటిక పోటీల ప్రారంభం రోజు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రముఖ సినీ నిర్మాత బన్నీ వాసు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. 15న అరవింద ఆర్ట్స్, తాడేపల్లి వారి విడాకులు కావాలి, ఉషోదయ కళ నికేతన్ కట్రపాడు వారి కిడ్నాప్, 16న మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఇది రహదారి కాదు, చైతన్య కళ స్రవంతి విశాఖపట్నం వారి (అ)సత్యం, మద్దుకూరి క్రియేషన్స్, చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, 17న అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, శ్రీసాయి కళ నిలయం, విజయవాడ వారి బ్రహ్మస్వరూపం, నటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి అనుహ్యం నాటికలు ప్రదర్శింపబడతాయి. అనంతరం స్థానిక రాజకీయ ప్రముఖులు, జిల్లాలోని పరిషత్ నిర్వాహకులతో పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. 3 రోజుల పాటు పాలకొల్లులో జరిగే నాటికల పండుగను విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ప్రజాశక్తి - గణపవరం

వరదరాజపురంలో మన ఊరు మన బడి మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కర్రి అపర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులను చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్, గోవర్ధిని, రాజేష్, పురుషోత్తం, నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు తప్పక టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో పశువులకు నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని జిల్లా పశు వైద్యాధికారి, ఉపవైద్యాధికారి కె.మురళీకృష్ణ, జాఫర్ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పశువులకు గాలి కుంటు, బ్రసెల్లోసిస్ వ్యాధి టీకాలు ఏ విధంగా చేస్తున్నారో ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య, వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలన్నారు. ప్రతి రైతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులు ఆరోగ్యంగా ఉండేలా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిని ప్రియాంక రాబర్ట్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శివదేవుని చిక్కాల గ్రామంలోని అంగన్వాడీ మెయిన్ సెంటర్లో, దగ్గులూరులోని తూర్పువీధి అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మమతశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన తల్లులకు 2006 బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకార, పోక్సో, బాలల హక్కుల చట్టాలు, సంక్షేమ పథకాలు, భేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పించారు.

స్వచ్ఛ నరసాపురంగా మార్చేందుకు కృషి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణాన్ని స్వచ్ఛ నరసాపురంగా తీర్చి దిద్దేందుకు ప్రజలందరి సహకారంతోపాటు అన్ని వ్యాపార సంస్థల సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏలూరు పర్యావరణ పరిరక్షణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, నరసాపురం మున్సిపాల్టీ ఆధ్వర్యంలో జరిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహనా సదస్సుకు పట్టణ మర్చంట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో, డిస్ పోసబుల్ ఐటెమ్స్ వ్యాపారులు, పండ్ల వర్కర్స్ సంఘం, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.అంజయ్య మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు క్రయ విక్రయాలు జరగకుండా అన్ని వ్యాపార సంస్థల సహకరించాలన్నారు.

నేడు విదేశీ వాణిజ్య పంటల సాగుపై సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అధిక పోషక విలువలు, వాణిజ్యపరంగా మంచి లాభాలతో వివిధ దేశాల్లో విస్తృతంగా సాగు చేయబడుతున్న ప్రసిద్ధ ఉద్యాన పంటలను, మన దేశంలోని భిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయడానికి తగిన సాంకేతికతను అభివృద్ధి చేయాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. గురువారం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.గోపాల్ అధ్యక్షతన అన్యదేశ ఉద్యాన పంటలు- హరిత భవిష్యత్తు కోసం ప్రపంచ వాణిజ్యం, సుస్థిరమైన సాంకేతికతలు అంశంపై హైబ్రిడ్ పద్ధతిలో అంతర్జాతీయ సదస్సును వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఉద్యాన పరిశోధనా స్థానం కాన్ఫరెన్స్ హాల్లో జరగనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వియాత్నం, శ్రీలంక, అమెరికా మొదలగు దేశాల నుంచి ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ విధానంలో పాల్గొంటారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా అమెరికాలోని ఆబర్న్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ప్రఖ్యాత ఉద్యాన శాస్త్రవేత్త ఎంఎస్.రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

చినఅమిరం అనాధాశ్రమంలో అన్నదానం

భీమవరం టౌన్: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న నినాదంతో ఈది ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కోనా జోసెఫ్ అన్నారు. బుధవారం చినఅమిరం ఇమ్మాన్యుయేలు అనాధ ఆశ్రమంలో చిన్నారుల మధ్య ఈది ఫౌండేషన్ సేవా సంస్థను ప్రారంభించి బాలలకు అన్నదానం చేశారు. జోసెఫ్ మాట్లాడుతూ సమాజసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈది ఫౌండేషన్ ఫౌండర్ ఈది రవికుమార్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 50 మంది బాలలకు అన్నదానం చేసి కేక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్రాన్సెస్, కేసి.రాజు, బి.కమలాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుగుణంగా బోధించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ సూచించారు. మొగల్తూరు, శేరేపాలెం, రామన్నపాలెం పంచాయతీల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్‌పి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎన్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా రామసతీష్

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న అందే రామ సతీష్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా బుధవారం ఎంపికయ్యారు. అదేవిధంగా కళాశాలకు నలభై రెండు సంవత్సరాలుగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా సేవలందించిన చినమిల్లి సత్యనారాయణరావు కళాశాల ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. గవర్నింగ్ బాడీ సభ్యుడు, జాయింట్ సెక్రటరీగా యర్రమిల్లి శివసుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు చేసిన ఉపాధ్యక్షులు పొన్నపల్లి రామారావు ఆ పదవికి రాజీనామా చేయడంతో ఈ మార్పులు జరిగాయని ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసినట్లు చినమిల్లి సత్యనారాయణ రావు తెలిపారు. వారిని కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు, జనరల్ బాడీ సభ్యులు, పట్టణ పుర ప్రముఖులు మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

విద్యార్థులను మోసగించిన కూటమి ప్రభుత్వం

వైసిపి జిల్లా అధ్యక్షులు ప్రసాదరాజు - యువత పోరుకు తరలివచ్చిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - భీమవరం



డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నేతలు

అమలు కానీ హామీలిచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసగించిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. వైసిపి ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పెదఅమిరం పార్టీ కార్యాలయం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా పార్టీ జెండాను ప్రసాదరాజు ఆవిష్కరించారు. అక్కడ నుంచి భీమవరం కలెక్టరేట్ వరకూ భారీ రాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు వైసిపి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ మాట్లాడారు. పేద ప్రజల పిల్లలపై చంద్రబాబు కక్ష సాధింపు చేస్తున్నారన్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి రాక్షసంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఉండి, పాలకొల్లు నియోజకవర్గ సమన్వయకర్తలు గుడాల గోపి, పివిఎల్ నరసింహరాజు, నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, సీనియర్ నాయకులు చిన్నిమిల్లి రాయుడు, గున్నం నాగబాబు, మాజీ ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ చెల్లం ఆనంద్ ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి దత్తాత్రేయ వర్మ, జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, ఎంపిపి నరసింహరాజు పాల్గొన్నారు.

కాళ్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలే వైసిపికి జీవమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పెదఅమిరంలో పార్టీ జిల్లా కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ, నర్సాపురం పార్లమెంటరీ అధ్యక్షురాలు గూడూరు ఉమాబాల, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పివిఎల్ నరసింహరాజు, గుడాల గోపి సమక్షంలో ముదునూరి ప్రసాదరాజు ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి నాయకులు, అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి యువత పోరు కార్యక్రమానికి బయలుదేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, పేరిచర్ల నరసింహరాజు, గాదిరాజు రామరాజు, వేగేశ్న జయ రామ కృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల మాజీ నేత ఏసుబాబు మృతి

సిపిఎం, యుటిఎఫ్, వృత్తిదారుల సంఘం సంతాపం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఏసుబాబు (ఫైల్‌ఫొటో)

మోగల్లు గ్రామానికి చెందిన ప్రజాసంఘాల మాజీ నేత ములపర్తి ఏసుబాబు (60) గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఏసుబాబు డివైఎఫ్ఐలో పని చేశారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ఆటలు పోటీల్లో చురుకైన పాత్ర పోషించేవారు. డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో భాగస్వాములుగా ఉన్నారు. అలాగే సిపిఎం సభ్యుడిగా ఏసుబాబు సుదీర్ఘ కాలం పాటు ఉన్నారు. పార్టీ పిలుపులో పాల్గొని అనేక సేవలందించారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం పాలకోడేరు మండల కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ముఖ్యంగా రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వృత్తిదారుల సమస్యలపై పనిచేశారు. ఏసుబాబుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏసుబాబు మృతి పట్ల సిపిఎం సానుభూతిని ప్రకటించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం ఏసుబాబుకు నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఏసుబాబు మృతి తీరని లోటు అన్నారు. అలాగే రజక వృత్తుదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడిక రాజు, పాలకోడేరు మండల ప్రెసిడెంట్ దొడ్డపట్ల అమ్మురావు నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ, నాయకులు గంటి శ్రీను, పాల వెంకటస్వామి, కె.క్రాంతిబాబు, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసరాజు, వృత్తిదారుల సంఘం నాయకులు మల్లిపూడి వెంకటేశ్వర్లు, తలుపురి నవీను, నాగేశ్వరరావు, సుబ్బారావు సంతాపం తెలిపారు.

అత్యాచార కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - నరసాపురం

పోక్సో కేసులో ముద్దాయికి న్యాయమూర్తి జీవిత ఖైదు, 50 వేలు జరిమానా, విధించినట్లు పట్టణ సిఐ బి.యాదగిరి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం.. 2017 డిసెంబర్ 12వ తేదీన నరసాపురం పట్టణ పరిధిలో ఐదో తరగతి చదువుతున్న 11 సంవత్సరాల బాలికపై నిందితుడు పెడరి నర్సింహరాజు పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయంపై అప్పటి ఎస్ఐ కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. అప్పటి నరసాపురం డిఎస్‌పి జి.పూర్ణచంద్రరావు విచారణలో భాగంగా 18 మంది సాక్షులను విచారించి ముద్దాయిని అరెస్టు చేశారు. తదుపరి ఈ కేసు ఫోరెన్సిక్ రిపోర్టును అప్పటి డిఎస్‌పి టి.ప్రభాకర్ బాబు తీసుకురావడంతో తరువాత డిఎస్‌పి కె.నాగేశ్వరరావు కోర్టులో ఛార్జి ఫైల్ చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ నిందితుడు పెడరి నర్సింహరాజుకు జీవిత ఖైదు, 5 వేల జరిమానా, బాధితురాలికి రూ.50 వేలు చెల్లించాలని తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడడం, సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడంలో డిఎస్‌పి జి.శ్రీవేద పర్యవేక్షణలో సిఐ బి.యాదగిరి, ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి, కోర్టు కానిస్టేబుల్స్ బి.శ్రీనివాస్, ఎం.వల్లభ రాయుడు సహకరించారన్నారు.

నేడు వల్లూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆచంట

పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లూరు యూనిట్ ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల ఆధ్వర్యంలో పిఎంపిడబ్ల్యుఎ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పిఎంపి అసోసియేషన్ సభ్యులు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో నరసాపురానికి చెందిన వైద్యులు గుబ్బల జితేంద్ర చైతన్య, అద్దంకి శివరామకృష్ణ, అద్దంకి విజ్ఞాని, పాలకొల్లుకు చెందిన జంధ్యాల సూర్యనారాయణ గుండె వైద్యనిపుణులు, పాలకొల్లు సౌజన్య హాస్పిటల్ ఎండి జిపిఎన్ అలేఖ్య, చిన్నపిల్లల వైద్య నిపుణులు, పాలకొల్లు ఉమా డెంటల్ కేర్ వైద్యనిపుణులు హేమంత్ మాధుర్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ముత్యాలపల్లిలో పశువైద్య శిబిరం

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించామని పశువుల డాక్టర్ జి.నీలిమ తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో 96 మూగజీవాలకు వ్యాధి నివారణ టీకాలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

దుండి లావణ్య, భర్త: కనకారావు, డోర్ నెం. 5-89, పెదపేట, వీరవాసరం, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రభుత్వ తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుండి ది. 06-06-2024 న **Y3424554** నెంబర్ పాస్‌పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తీసుకొని ది. 20-02-2025 న మా అమ్మ వద్దకు పాలకొల్లు మండలం, వెలివెలకి వెళ్ళిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ గురించి మాట్లాడటానికి వెళ్లేటప్పుడు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ జిరాక్స్ తీయడానికి లంకల కోడేరు ఆటోలో వెళ్తూ నేను వైజాగ్ లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్ : 83676 09044

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, యలమంచిలి మండలం, గుంపర్రు పంచాయితీ పరిధి లంకపాలెం గ్రామానికి చెందిన కంకటాల రూపవతి, భర్త: కంకటాల నాగరాజు, డోర్ నెం. 3-19/2 నకు చెందిన **P 9984294** నెంబర్ గల పాస్‌పోర్ట్ విశాఖపట్నం వారు ది. 12-04-2017 న జారీ చేసిన పాస్‌పోర్ట్ పోయినది. లంకపాలెం నుండి దొడ్డిపట్ల జిరాక్స్ నిమిత్తం మోటర్ సైకిల్ పై వెళుతుండగా పాస్‌పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యలో పడిపోయినది. ఆ కవరులో విశాఖపట్నం వారి జారీ చేసిన **P 9984294 ఒరిజినల్ పాస్‌పోర్ట్** కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌ను సంప్రదించగలరు.

కంకటాల రూపవతి
భర్త: నాగరాజు,
డోర్ నెం. 3-19/2, గుంపర్రు,
లంకపాలెం, యలమంచిలి మండలం,
ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
పిన్. నెం: 534266
సెల్: 95500 83497

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొత్తపేట
H.M.O.P. No. 109/2023

Between:

అడ్డాల సురేష్ ...పిటీషనర్

మరియు

అడ్డాల మధు మాధవి మణి ...రెస్పాండెంటు

రెస్పాండెంటు అడ్రసు:-

అడ్డాల మధు మాధవి మణి,
W/o. అడ్డాల సురేష్
D/o. జి. రాజశేఖర్
వయస్సు 35 సం॥, ప్రైవేటు జాబ్,
R/o. విస్సాకోడేరు విలేజ్, పాలకోడేరు మండలం.

పై నెంబరు OP లో మీకు జారీకావలసిన నోటీసులు చాలా పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినప్పటికి మీరు తీసుకొనక Avoid చేసినందున **ది. 19-03-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

Sri. Pakerla Srinivas
Panthagani Keerthi
Advocates,
Bhimavaram, W.G.Dt
Cell: 98483 91100

Kothapeta
Dt. 12-03-2025

మహారాజశ్రీ నర్సాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (Junior Division) వారి కోర్టులో
O.S.No. 225/2023

Between:

Plaintiff : Sagireddy Venkata Subbarao
And
Defendant :
Mohammad Abdul Basheer and oters

To

2. Mohammad Ahmed Valli, S/o Masthan Saheb, R/o Door no.12-2-13/4, 13th Ward, Narsapur.
3. Mohammad Hussain, S/o Zainulabdin, 16th Ward, Panja Centre, Narsapur.
4. Mohammad Badrunnisa, D/o Hussain, 16th Ward, Panja Centre, Narsapur.
5. Mohammad Zainulabdin, S/o Hussain, 16th Ward, Panja Centre, Narsapur.

పై 2 to 5 ప్రతివాద్లు కు పై నెంబరు దావాలో కోర్టు వారు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంప్పినప్పటికిన్ని మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావాలోని దావా సమన్లు మీకు అమలు జరుగు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా అమలు జరపడమైనది. కాబట్టి **ది. 7-4-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టులో మీరు స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియడల మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

// By orders of Court //

శ్రీ గునిశెట్టి శ్రీనివాసరావు,
అడ్వకేట్, నర్సాపురం,
ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్: 95531 26234

నర్సాపురం
ది. 12-03-25,

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి
టెండరు ప్రకటన

రే.క.నెం.43/JA/2025 తేది.12-03-2025

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా గ్రంధాలయ సంస్థ ప్రక్కన గల గ్రామపంచాయితీ కి చెందిన రెండు షాపులకు నుదహరించిన షెడ్యూలు దాఖలా లకు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది. 19-03-2025వ తేది బుధవారం సాయంత్రం 4.00 గం॥లకు ఆగిరిపల్లి గ్రామపంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయతీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం వేయబడును. బహిరంగ వేలము నందు పాల్గొనదలచిన వారు సంబందిత తహసిల్దారు వారి వద్ద నుండి పొందిన రూ. 10,00,000/- లకు సాల్వెన్సి ధృవీకరణ మరియు షెడ్యూల్ నందు తెలిపిన ధరావతులు చెల్లించి హెచ్చు పాట మొత్తము ఏక మొత్తములో వెంటనే చెల్లించు విధానము ననుసరించి బహిరంగ వేలం పాటలలో పాల్గొనవలయును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలిసికొనవచ్చును.

వ.నెం.	అయిటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు	పాట కాలపరిమితి 3 సం॥లకు
1	జిల్లా గ్రంధాలయ సంస్థ ప్రక్కన షాపు - 1	రూ.1,00,000/-లు	01-04-2025 నుండి 31-03-2028 వరకు
2	జిల్లా గ్రంధాలయ సంస్థ ప్రక్కన షాపు - 2	రూ.1,00,000/-లు	01-04-2025 నుండి 31-03-2028 వరకు

సం/- **బొల్లినేని ప్రసాద్**
గ్రామపంచాయతీ కార్యదర్శి, ఆగిరిపల్లి,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.